## ఈవెంట్ కోసం వెళ్తుండగా..

### టిప్పర్ ఢీకొని యువకుడి దుర్మరణం


మహేశ్ (ఫైల్)

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి 23 : ఈవెంట్ కోసం వెళ్తుండగా టిప్పర్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. మానకొండూర్ మండలం చెంజర్లలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హుజూరాబాద్ మండలం సిర్సపల్లి గ్రామానికి చెందిన వెంగళ్‌దాస్ మహేశ్(18) ఆదివారం తెల్లవారుజామున (ఉదయం 3 గంటలకు) తన బైక్‌పై సిర్సపల్లి నుంచి కరీంనగర్‌లోని ఓ ఈవెంట్ కోసం వెళ్తున్నాడు. చెంజర్లకు రాగానే నేషనల్ హైవేపై డీబీఎస్ కంపెనీకి చెందిన టిప్పర్ డ్రైవర్ ఎలాంటి ఇండికేటర్ లేకుండా ఒక్కసారిగా కంపెనీలోకి తిప్పడంతో, మహేశ్ బైక్‌పై నుంచి అతని చాతి మీదుగా టిప్పర్ వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ అతిడిని స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మృతుడికి తల్లి, తండ్రితో పాటు ఓ సోదరి ఉన్నారు. టిప్పర్ డ్రైవర్ ఎలాంటి ఇండికేటర్ వేయకుండా, అతి వేగంతో డీబీఎల్ కంపెనీలోకి వెళ్లడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు మృతుడి తండ్రి వెంగళ్ దాస్ రాజు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మానకొండూర్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. కాగా, పై చదువుల కోసం తల్లిదండ్రులకు భారం కాకూడదని, అప్పుడప్పుడు ఫ్రెండ్స్‌తో ఈవెంట్స్ చేస్తున్న మహేశ్ ఇలా రోడ్డు ప్రమాదంలో మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

### సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలి

నేషనల్ హైవే పనుల్లో భాగంగా కాంట్రాక్ట్ చేపట్టిన సంస్థ పూర్తి స్థాయిలో సూచికల బోర్డు ఏర్పాటు చేయడం లేదని, ఎప్పుడు ఏం సంఘటన జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ బోర్డు ఎప్పుడు ఏర్పాటు చేస్తారో, ఏ వర్క్ మొదలు పెడుతారో తెలియదని, పని చేపట్టే ముందు పూర్తి స్థాయిలో సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## ప్రమాదకరంగా గుంత.. పట్టించుకునే వారేరి?


గుంతలో నుంచి కదలని ఆటో

జిల్లాకేంద్రంలోని బస్టాండు సమీపంలో ప్రధాన రహదారి పక్కన కొన్ని రోజుల క్రితం ఏర్పడ్డ గుంత ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. కళాభారతి ఎదురుగా గల వీధిని ప్రధాన రహదారికి అనుసంధానించే రోడ్డుపై ఫీటు లోతుకు పైగా గుంత ఏర్పడటంతో ఆ వీధి గుండా వచ్చి పోయే వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. ప్రతి రోజు మూడు, నాలుగు ప్రమాదాలు జరగడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. ఇక ఆటో చక్రాలు గుంతలో పడితే కదలడమే లేదని డ్రైవర్లు వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గుంత పూడ్చి, ప్రమాదాల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు. **- కలెక్టరేట్, ఫిబ్రవరి 23**

# మిగిలింది 35 రోజులే!

- సగానికి పైగా వసూళ్ల లక్ష్యం
- ఎన్నికల విధుల్లో పలువురు సిబ్బంది




కరీంనగర్ కార్పొరేషన్, ఫిబ్రవరి 23 : ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 35 రోజులు మాత్రమే మిగిలింది ఉంది. కానీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో అత్యధిక మున్సిపాలిటీలు ఇప్పటి వరకు కేవలం 50 శాతం మేరకే ఆస్తి పన్నులను వసూలు చేశాయి. ఇంకో 50 శాతం వసూలు చేయాల్సి ఉండగా, ఎమ్మెల్సీ ఎన్నికల కోసం మున్సిపాలిటీ సిబ్బందికి కూడా విధులు కేటాయించడంతో ఈ నెల 27న జరిగే పోలింగ్‌తోపాటు, కౌంటింగ్ వరకు వారు బిజీగా ఉండే అవకాశం ఉంది. మిగిలిన సమయంలో ఏ మేరకు వసూలు చేస్తారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### లక్ష్యం పూర్తయ్యేనా ?

కరీంనగర్ నగరపాలక సంస్థ ప్రతి ఏటా సుమారు 95 శాతానికి పైగానే ఆస్తి పన్నులు వసూళ్లు చేస్తుంది. కానీ, ఈసారి మాత్రం ఇప్పటి వరకు సుమారు 52 శాతానికి మాత్రమే పరిమితమైంది. దీంతో మరో 35 రోజుల్లో ఏ మేరకు వసూళ్ల లక్ష్యాన్ని చేరుకుంటుందన్న విషయంలో సందేహాలు వస్తున్నాయి. దీనికి తోడు ఓ వైపు ఎన్నికలు ఉండగా... మరోవైపు నగరపాలక సంస్థలో ఉన్నతాధికారులు చేపట్టిన బదిలీల వ్యవహారం వసూళ్లపై ప్రభావం చూపే అవకాశాలున్నాయి. ముఖ్యంగా గతంలో బిల్ కలెక్టర్ల వారీగా రోజువారి లక్ష్యాలను నిర్ణయించి వసూలు చేసేవారు. బిల్ కలెక్టర్లు ఉదయం నుంచే బకాయిలు ఉన్న ఇంటికి వెళ్లి వసూలుపై దృష్టి సారించే వారు. కానీ, ఇప్పుడు బిల్ కలెక్టర్ల వ్యవస్థను తీసేసి వార్డు ఆఫీసర్ వ్యవస్థ తీసుకు వచ్చారు. కొత్తగా వచ్చిన వారు ఆయా డివిజన్లలో ఏ ఇల్లు ఎక్కడ ఉందో తెలుసుకునేందుకే సమయం గడిచిపోయేలా ఉంది. అలాగే, వార్డు ఆఫీసర్లందరూ ఉదయం 10 గంటలు అయితే కానీ విధులకు హాజరు కావడం లేదని తెలుస్తోంది. ఈక్రమంలో వారు వసూలు కోసం వెళ్లే సమయానికి ఇళ్ల యజమానులు తమ పనుల మీద బయటకు వెళ్లే అవకాశం ఉంది. వీరు కొత్తగా రావడం వల్ల ఆయా వార్డుల్లో సరైన సంబంధాలు లేక వసూళ్లలో సమస్యలు వచ్చేలా ఉన్నాయి. నగరపాలక సంస్థలో చేపట్టిన బదిలీలను ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత చేస్తే బాగుండేదన్న వాదన మాజీ కార్పొరేటర్లు చేస్తున్నారు. ప్రస్తుతం చేసిన బదిలీలతో బల్దియాకు ఆదాయం తగ్గే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### వసూళ్లలో సుల్తానాబాద్ పూర్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు కూడా తమ ఆస్తి పన్నులపై ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప అనుకున్న లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పటి వరకు ఒక్క జమ్మికుంట మాత్రమే 75 శాతానికి పైగా పన్నుల వసూళ్లను పూర్తి చేసింది. హుజూరాబాద్, కోరుట్ల, సిరిసిల్ల మున్సిపాలిటీలు 70 శాతం మేరకు వసూలు చేయగా మిగిలిన అన్ని మున్సిపాలిటీలు కూడ 60 శాతం లోపే వసూలు చేశాయి. కరీంనగర్ నగరపాలక సంస్థలో 83,241 ఇళ్లు ఉండగా వీటి నుంచి రూ.47.19 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. కానీ, ఇప్పటి వరకు రూ.24.21 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. అలాగే, జమ్మికుంటలో 12,591 ఇళ్లు ఉండగా రూ.3.15 కోట్లకు రూ.2.45 కోట్లు, హుజూరాబాద్‌లో 8,914 ఇళ్లు ఉండగా రూ.2.65 కోట్లకు రూ.1.83 కోట్లు, చొప్పదండిలో 4,233 ఇళ్లు ఉండగా రూ.2.49 కోట్లకు రూ.1.24 కోట్లు వసూలయ్యాయి. జగిత్యాల జిల్లాలోని జగిత్యాల మున్సిపాలిటీలో 27,152 ఇళ్లు ఉండగా రూ.13.41 కోట్లకు రూ.5.81 కోట్లు, కోరుట్లలో 19,166 ఇళ్లు ఉండగా రూ.5.05 కోట్లకు రూ.3.50 కోట్లు, మెట్‌పల్లిలో 13,467 ఇళ్లు ఉండగా రూ.3.96 కోట్లకు రూ.2.51 కోట్లు, రాయికల్‌లో 5,367 ఇళ్లు ఉండగా రూ.1.32 కోట్లకు రూ.83 లక్షలు, ధర్మపురిలో 4,628 ఇళ్లు ఉండగా రూ.1.34 కోట్లకు రూ.54 లక్షలు వసూలయ్యాయి. సిరిసిల్లలో 23,476 ఇళ్లు ఉండగా రూ.6.28 కోట్లకు రూ.4.35 కోట్లు, వేములవాడలో 14,655 ఇళ్లు ఉండగా రూ.4.29 కోట్లకు రూ.2.62 కోట్లు, పెద్దపల్లి జిల్లాలోని మంథనిలో 5,089 ఇళ్లు ఉండగా రూ.1.74 కోట్లకు రూ.1.04 కోట్లు, పెద్దపల్లిలో 12,058 ఇళ్లు ఉండగా రూ.5.42 కోట్లకు రూ. 3.08 కోట్లు, రామగుండం నగరపాలక సంస్థలో 50,967 ఇళ్లు ఉండగా రూ.16.17 కోట్లకు రూ.8.48 కోట్లు, సుల్తానాబాద్‌లో 5,425 ఇళ్లు ఉండగా రూ.2.78 కోట్లకు రూ.94 లక్షలు వసూలయ్యాయి.

# గోడలపై తొలగని ప్రచార రాతలు

### ఎన్నికల కోడ్ అమలులో అధికారుల నిర్లక్ష్యం


దుర్శేడ్ సబ్‌స్టేషన్ ప్రహరీపై ప్రచార రాతలు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 23 : కరీంనగర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్సీ అభ్యర్థులు గతంలో ఏర్పాటు చేసిన ప్రచార ఫ్లెక్సీలు, గోడలపై వాల్ రైటింగ్‌ను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. కానీ, ప్రభుత్వ కార్యాలయాల గోడలపై అభ్యర్థుల వాల్ రైటింగ్‌ను తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రాజీవ్‌రహదారి పక్కన గోడపైన, గుంటూర్‌పల్లి స్టేజీ వద్ద రైల్వే బ్రిడ్జ్ గోడల పైన పెద్దపెద్ద అక్షరాలతో కనిపిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల కోడ్ అమలులో అధికారులు అనుసరిస్తున్న ద్వంద్వ విధానాలపై విమర్శలు వస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు చేయడం లేదని నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాలపై ఎంపీడీవోకు నోటీసు ఉత్తర్వులు పంపిణీ డీపీవో, జిల్లా అధికార యంత్రాగాలు, జిల్లా స్థాయి అధికారులు నగర పాలక సంస్థలో విలీనం చేసిన గ్రామాల్లో వాల్ రైటింగ్ విషయంలో పట్టింపు లేక పోవడం చర్చనీయాంశంగా మారింది.

## పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి..

### బావిలో పడి రైతు మృతి


కటుకం సత్తయ్య (ఫైల్)

రామడుగు, ఫిబ్రవరి 23 : తెల్లవారుజామునే పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లిన ఓ రైతు ప్రమాదవశాత్తు బావిలో పడి మృత్యువాత పడ్డాడు. రామడుగు మండలం వెలిచాల అనుబంధ గ్రామం గుడ్డేలుగులపల్లిలో ఆదివారం జరిగిన ఈ ఘటన గ్రామంలో విషాదం నింపింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కటుకం సత్తయ్య(57) ఆదివారం తెల్లవారుజామున వరి పొలానికి నీళ్ళు పెట్టేందుకు వెళ్ళాడు. ఎండకాలం కావడంతో నీరు ఎంతుందోనని వ్యవసాయ బావిలోకి చూసేందుకు ప్రయత్నించగా, ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడ్డాడు. దీంతో తల దరికి తగిలి తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్ళిన సత్తయ్య నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. కాగా, పొలానికి నీళ్ళు పెట్టేందుకు వెళ్ళిన సత్తయ్య మధ్యాహ్నం దాటినా ఇంటికి రాకపోడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్ళి చూడగా కనిపించక పోవడంతో ఊరంతా గాలించారు. అయినా సత్తయ్య జాడ లభించకపోవడంతో పొలం వద్ద ఉన్న వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లి చూశారు. అక్కడ చెప్పులు కనిపించడంతో అనుమానం వచ్చి బావిలోని నీటిని మోటార్ ద్వారా ఎత్తిపోయించారు. దీంతో సత్తయ్య మృతిచెంది దయనీయ స్థితిలో కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య అమృతమ్మతో పాటు కొడుకులు, కూతురు ఉన్నారు.


మాట్లాడుతున్న మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్కుడు కొండా దేవయ్య పటేల్

## మున్నూరు కాపులు ఐక్యంగా ముందుకు సాగాలి

విద్యానగర్, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో మున్నూరు కాపులు రాజకీయాలకతీతంగా హక్కుల కోసం ఐక్యంగా ముందుకు సాగాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్కుడు కొండా దేవయ్య పటేల్ పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్, మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.5000 కోట్ల నిధులతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో కుల గణనలో మున్నూరు కాపులకు జరిగిన అన్యాయంపై సమష్టిగా పోరాటం చేయాలని, మార్చి చివరి వారంలో ఆత్మగౌరవ సభను హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మున్నూరు కాపులపై అధికార ప్రభుత్వం అణచివేత ధోరణి అవలంభిస్తున్నదని, బీసీలను.. అందులో మున్నూరు కాపులను మరీ తక్కువ చూపించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మున్నూరుకాపుల శక్తి నిరూపణకు సమయం ఆసన్నమైందన్నారు. ఈ సమావేశంలో సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్, కార్యదర్శి కొట్టె మహేశ్, వెంగళ రమేశ్, మరాటి సత్తన్న, శెట్టిపల్లి నరేందర్ పాల్గొన్నారు.

### కుక్కదాడిలో ఎనిమిది మందికి గాయాలు

వీణవంక, ఫిబ్రవరి 23: ఘన్ముక్ల గ్రామంలో పిచ్చికుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఘన్ముక్ల గ్రామంలో ఆదివారం పిచ్చి స్వైర విహారం చేసి ఎనిమిది మందిని గాయపరచగా, అందులో కొత్తపల్లి వీరమ్మ, అంగిడి సూరమ్మ అనే వృద్ధురాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని వెంటనే 108 వాహన సిబ్బంది అత్యవసర చికిత్స అందిస్తూ హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గ్రామంలో పిచ్చి కుక్కల బారి నుంచి అధికారులు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# రాబడి

## బేరిష్ ట్రెండ్‌లోనే ట్రేడింగ్!

**దేశీయ** స్టాక్ మార్కెట్లు నష్టాల్లోనే నడుస్తున్నాయి. నిజానికి జనవరి నుంచి సూచీలు తీవ్ర ఆటుపోట్లకే లోనవుతున్నాయి. స్థిరత్వం లోపించిందనే చెప్పాలి. అమ్మకాలు, కొనుగోళ్ల మధ్య ఇన్వెస్టర్లు ఊగిసలాటకు గురవుతున్నారు మరి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 628.15 పాయింట్లు లేదా 0.82 శాతం పతనమై 75,311. 06 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 133.35 పాయింట్లు లేదా 0.58 శాతం క్షీణించి 22,795.90 దగ్గర నిలిచింది. ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రకటించిన కేంద్ర బడ్జెట్, ఆ తర్వాత వచ్చిన ద్రవ్యసమీక్షలో అంచనాలు అందుకోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీ రేట్ల కోతలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేస్తున్న సుంకాలు.. మదుపరులను పెట్టుబడులకు దూరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వారం కూడా ట్రేడింగ్‌లో ఒడుదొడుకులకు ఆస్కారముందని మెజారిటీ నిపుణుల అంచనా. ఇక డాలర్‌తో పోల్చితే ఆల్‌టైమ్ కనిష్ఠాల వద్ద కదలాడుతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తూనే ఉన్నది. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమేనని చెప్పవచ్చు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,100 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,000-23,200 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.




**గమనిక..**


స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్కుతో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడుదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

## రెపో తగ్గింపుతో మేలెంత?

**రిజర్వ్** బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) దాదాపు ఐదేండ్ల తర్వాత రెపో రేటును పావు శాతం తగ్గించింది. 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తీసుకొచ్చింది. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాల భారం తగ్గుతుందని, ఈఎంఐలు దిగొస్తాయన్న అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఆర్బీఐ నిర్ణయానికి తగ్గట్టుగా బ్యాంకులూ వడ్డీరేట్లను తగ్గిస్తేనే పాత, కొత్త రుణగ్రహీతలకు లాభమన్న విషయాన్ని మరువద్దు. ఒకవేళ బ్యాంకులు కూడా తామిచ్చే రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తే ఎంత ప్రయోజనం ఉంటుంది?

*ఉదాహరణకు గృహ రుణాన్నే తీసుకుంటే..*


| | |
|---|---|
| **రుణం** | **రూ.30 లక్షలు** |
| **కాలపరిమితి** | **20 ఏండ్లు** |
| **మునుపటి వడ్డీరేటు** | **8.50%** |
| **మారిన వడ్డీరేటు** | **8.25%** |
| **పాత వడ్డీరేటుతో ఈఎంఐ** | **రూ.26,035** |
| **కొత్త వడ్డీరేటుతో ఈఎంఐ** | **రూ.25,562** |
| **నెలకు ఈఎంఐలో తగ్గేది** | **రూ.473** |
| **మొత్తం టెన్యూర్‌పై వడ్డీ లాభం** | **దాదాపు రూ.1.14 లక్షలు** |



*గమనిక: వడ్డీరేట్లు తగ్గించినప్పుడు ఆ ప్రయోజనాన్ని ఈఎంఐలను తగ్గించడం ద్వారానైనా లేదా కాలపరిమితిని దించడం ద్వారానైనా బ్యాంకులు రుణగ్రహీతలకు అందిస్తాయి.*

# ఓల్డ్ ఈజ్ గోల్డ్!

## ఇప్పటికీ పాత పన్ను విధానమే లాభమా?




ఇటీవలి బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయ పన్ను కొత్త విధానాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత ఆకర్షణీయంగా మార్చిన విషయం తెలిసిందే. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రకటించిన పద్దులో ఏకంగా రూ.12 లక్షలదాకా వార్షిక ఆదాయం ఉన్నవారికి ఎలాంటి పన్నులు ఉండబోవని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. మునుపు ఇది రూ.7 లక్షలుగానే ఉన్నది. ఇక స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలతో కలిపితే ఈ పన్ను మినహాయింపు ప్రయోజనం రూ. 12.75 లక్షలకు చేరుతున్నది. అయితే బడ్జెట్‌కు ముందున్న కొత్త పన్ను విధానంతో పోల్చితే ఇప్పుడు రూ.5 లక్షలకుపైగా పన్ను మినహాయింపు ప్రయోజనం పెరిగినా.. ఇంకా పాత పన్ను విధానంలోనే ట్యాక్స్‌పేయర్స్‌కు అధిక లాభాలు కనిపిస్తుండటం గమనార్హం. రూ.15 లక్షలు వార్షిక వేతనం ఉన్నవారు.. గరిష్ఠ పన్ను మినహాయింపులను కనుక ఉపయోగించుకున్నట్టైతే కొత్త పన్ను విధానం కింద చెల్లించాల్సి వచ్చే పన్నుల్లో సగం చెల్లిస్తే సరిపోతున్నది మరి. 48వేల రూపాయలకుపైగా ప్రయోజనం చేకూరుతున్నది.

### ప్రస్తుతం ఆదాయ పన్ను శ్లాబులు-రేట్లు

**పాత పన్ను విధానం**

| శ్లాబులు (రూ.ల్లో) | రేట్లు |
|---|---|
| 2.50 లక్షల వరకు | లేదు |
| 2.50-5 లక్షలు | 5% |
| 5 లక్షలు-10 లక్షలు | 20% |
| 10 లక్షలపైన | 30% |

**కొత్త పన్ను విధానం**

| శ్లాబులు (రూ.ల్లో) | రేట్లు |
|---|---|
| 4 లక్షల వరకు | లేదు |
| 4 లక్షలు-8 లక్షలు | 5% |
| 8 లక్షలు-12 లక్షలు | 10% |
| 12 లక్షలు-16 లక్షలు | 15% |
| 16 లక్షలు-20 లక్షలు | 20% |
| 20 లక్షలు-24 లక్షలు | 25% |
| 24 లక్షలపైన | 30% |

**ఇదీ సంగతి..**

దేశంలోని వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులందర్నీ కొత్త ఆదాయ పన్ను పరిధిలోకి తేవాలన్న లక్ష్యంతో మోదీ సర్కారు ముందుకెళ్తున్నది. అందుకే ఐదేండ్లుగా ప్రతీ బడ్జెట్‌లో ఈ కొత్త ఆదాయ పన్ను విధానంలోనే రకరకాల సవరణలు, మినహాయింపులు, ప్రయోజనాలను కల్పిస్తూ వస్తున్నది. 2020లో కొత్త ఆదాయ పన్ను విధానాన్ని తెరపైకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అప్పట్నుంచి పాత ఆదాయ పన్ను విధానం జోలికే వెళ్లడం లేదు. అయినప్పటికీ ట్యాక్స్‌పేయర్స్‌కు ఇంకా పాత ఆదాయ పన్ను విధానమే ఉత్తమంగా నిలుస్తుండటం గమనార్హం. అయితే పొదుపు, పెట్టుబడులు, పెద్దగా ఖర్చులు లేని ఉద్యోగులు.. కొత్త ఆదాయ పన్ను విధానాన్ని ఎంచుకోవడమే లాభదాయకం అని చెప్పవచ్చు. కానీ ఏటా పీపీఎఫ్, ఈపీఎఫ్, ఈఎల్ఎస్ఎస్, ఎన్‌పీఎస్, గృహ రుణం, బీమా ప్రీమియంలు, గృహ రుణ అలవెన్స్ (హెచ్ఆర్ఏ), పిల్లల విద్య కోసం చేసే ఖర్చులు వంటివి క్లెయిం చేసుకునే వీలున్న వారు మాత్రం పాత ఆదాయ పన్ను విధానాన్ని అనుసరించడమే ఇప్పటికీ లాభదాయకమని చెప్పవచ్చు.

### గుర్తుంచుకోండి

- కొత్త ఆదాయ పన్ను విధానంలో వార్షిక ఆదాయం రూ.12.75 లక్షలు దాటితే వయసుతో సంబంధం లేకుండా అందరికీ ఒకేలా ఆయా శ్లాబుల ప్రకారం పన్ను రేట్లు వర్తిస్తాయి.
- **పాత పన్ను విధానంలో 60-80 ఏండ్ల వయసువారికి వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా పన్ను లేదు. 80 ఏండ్లు దాటితే రూ.5 లక్షలదాకా పన్నుండదు. దీంతో వివిధ సెక్షన్ల కింద పన్ను మినహాయింపు గరిష్ఠంగా 60-80 వారికి ఏటా రూ.11.25 లక్షలదాకా, 80 ఏండ్లు దాటినవారికి రూ.13.25 లక్షలదాకా ఉంటున్నది.**
- కొత్త పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలతో కలిపి వార్షిక ఆదాయం రూ.12.75 లక్షలదాకా పన్ను మినహాయింపున్నది. నిజానికి స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపి రూ.4.75 లక్షలదాకా ఎవరికీ పన్నుండదు. అయితే రూ.12.75 లక్షల లోపున్న వారికి మిగతా రూ.8 లక్షలకు శ్లాబుల ప్రకారం వర్తించే రూ.60 వేల పన్నును సెక్షన్ 87ఏ కింద రిబేటుగా ఇస్తున్నారు. కానీ ఇది వార్షిక ఆదాయం రూ.12.75 లక్షలు మించకపోతేనే వర్తిస్తుంది.
- **గరిష్ఠ పన్ను మినహాయింపుల్ని ఉపయోగించగలిగితే వార్షిక ఆదాయం రూ.20 లక్షలదాకా పాత విధానాన్ని ఎంచుకోవచ్చు. అయితే సాధారణ ట్యాక్స్‌పేయర్స్‌కు వార్షిక ఆదాయం రూ.22 లక్షలు దాటితే కొత్త విధానమే లాభం. సీనియర్ సిటిజన్లు మాత్రం తమకు ఏది లాభమో లెక్కించి నిర్ణయం తీసుకోవడం మంచిది.**
- ఏదిఏమైనా పన్ను చెల్లింపుదారులు ఐటీ రిటర్న్స్ దాఖలు చేసేటప్పుడు ఏటా తమ పొదుపు, ఖర్చులు, పెట్టుబడులు, ఆదాయం అన్నింటినీ పరిశీలించుకున్నాకే పాత, కొత్త ఆదాయ పన్ను విధానాలను ఎంచుకోవడం తెలివైన నిర్ణయమని చెప్పవచ్చు.

**పాత పన్ను విధానంలో**

| | | |
|---|---|---|
| వార్షిక స్థూల వేతనం | : | రూ.15 లక్షలు |
| గరిష్ఠ పన్ను మినహాయింపులు | : | రూ.8.25 లక్షలు |
| నికర పన్ను ఆదాయం | : | రూ.6.75 లక్షలు |

శ్లాబుల ప్రకారం

| శ్లాబు | రేటు | పన్ను |
|---|---|---|
| 0-రూ.2.5 లక్షలు | లేదు | 0 |
| రూ.2.5-5 లక్షలదాకా | 5% | రూ.12,500 |
| రూ.5 లక్షలు-6.75 లక్షలదాకా | 20% | రూ.35,000 |
| మొత్తం | | రూ.47,500 |
| సెస్సు 4% (రూ.47,500పై) | | రూ.1,900 |
| తుది పన్ను మొత్తం | | రూ.49,400 |

**కొత్త పన్ను విధానంలో**

| | | |
|---|---|---|
| వార్షిక స్థూల వేతనం | : | రూ.15 లక్షలు |
| స్టాండర్డ్ డిడక్షన్ | : | రూ.75 వేలు |
| నికర పన్ను ఆదాయం | : | రూ.14.25 లక్షలు |

శ్లాబుల ప్రకారం

| శ్లాబు | రేటు | పన్ను |
|---|---|---|
| 0-రూ.4 లక్షలు | లేదు | 0 |
| రూ.4-8 లక్షలదాకా | 5% | రూ.20,000 |
| రూ.8-12 లక్షలదాకా | 10% | రూ.40,000 |
| రూ.12-14.25 లక్షలదాకా | 15% | రూ.33,750 |
| మొత్తం | | రూ.93,750 |
| సెస్సు 4% (రూ.93,750పై) | | రూ.3,750 |
| తుది పన్ను మొత్తం | | రూ.97,500 |

### పాత పన్నులో గరిష్ఠ మినహాయింపులివీ

**స్టాండర్డ్ డిడక్షన్ : రూ.50 వేలు**

**సెక్షన్ 80సీ (పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ, ఈఎల్ఎస్ఎస్ తదితర సేవింగ్స్, ఖర్చులు, పెట్టుబడుల కింద) : రూ.1.5 లక్షలు**

**సెక్షన్ 10(13ఏ) (హౌజ్ రెంట్ అలవెన్స్) : రూ.3 లక్షలు (నెలవారీ బేసిక్ సాలరీ రూ.50 వేలపై రూ.25 వేలుగా లెక్కిస్తే)**


**సెక్షన్ 24బీ (గృహ రుణంపై వడ్డీ చెల్లింపు కింద) : రూ.2 లక్షలు**

**సెక్షన్ 80సీసీడీ(1బీ) (ఎన్‌పీఎస్‌కు విరాళాల కింద అదనపు పన్ను మినహాయింపు) : రూ.50 వేలు**


**సెక్షన్ 80డీ (ఆరోగ్య బీమా కోసం ప్రీమియం కింద) : రూ.75 వేలు**

**మొత్తం ఆదాయంలో ఇలా వివిధ సెక్షన్ల కింద గరిష్ఠంగా రూ.8.25 లక్షలదాకా పన్ను మినహాయింపు.**

**శ్లాబు ప్రకారం వార్షిక ఆదాయం రూ.2.5 లక్షలదాకా ఎవరికీ పన్నుండదు. మొత్తంగా రూ.10.75 లక్షలదాకా పన్నులేదు.**




### కొత్త పన్ను విధానంలో గరిష్ఠ మినహాయింపులివీ







**వార్షిక ఆదాయం రూ.12 లక్షలు దాటకపోతే పన్నుండదు**

**స్టాండర్డ్ డిడక్షన్: రూ.75 వేలు**

**ఇలా ఏటా మొత్తం ఆదాయం రూ.12.75 లక్షలు మించకపోతే పూర్తిగా పన్ను మినహాయింపు**

**వార్షిక ఆదాయం రూ.12.75 లక్షలు దాటితే (స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలు కలిపి) పన్ను మినహాయింపు రూ.4.75 లక్షలకు (స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలు కలిపి) పడిపోతుంది. శ్లాబుల ప్రకారం రూ.4 లక్షలదాకా ఎవరికీ పన్నులు పడవు. దానికి స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలు కూడా కలిపితే రూ.4.75 లక్షలదాకా పన్ను ప్రసక్తే లేదన్నమాట.**